# మమతల పొతర

రాత్రి ఎనిమిదిన్నర గంటలవేళ.

హైమవతి విశ్వనాథంగార్లు భోజనాల ముందర కూర్చొబోతున్నారు. వంటకాలన్నీ బల్లమీదికి చేర్చిందామె. ఆయన పళ్ళాలు మంచినీళ్లూ పెట్టాడు.

"ఏంకూర చేశావు?"

అప్పటికప్పుడు కళ్ళనిండా అశ్రువులు కమ్మాయి. కంఠం పట్టేసినట్లయింది ఆమెకు.

కళ్ళుతెరిస్తే కన్నీళ్ళు బైటికివస్తాయి.

మాట్లాడితే కంఠధ్వని పసిగట్టేస్తాడు.

అందుకే ఆమె చప్పున వంటయింట్లోకి వెళ్ళింది.

"మళ్ళీ ఎందుకు వెళ్ళావు? అన్నీ తీసుకువచ్చావుగా?"

ఆయన దిగ్గునలేచి వంటయింట్లోకివెళ్ళాడు. ఆమె కళ్ళు కొంగుతోఒత్తుకుని గొంతు సవరించుకుంటోంది.

"ఇందుకా ఇక్కడికివచ్చావు? ఏమయింది?" ఆమెను పొదలిపట్టుకుని బల్లముందరికి తీసుకువచ్చాడు. ఎందుకో ఆమె కన్నీటిని ఆయన చూడలేదు. మనసంతా దేవినట్లవుతుంది. ఆయన రిటైరయినతరువాత ఇద్దరిమధ్యా సాన్నిహిత్య మెక్కువైంది. ఏపనిచేసినా ఇద్దరూకలిసి చేసుకుంటున్నారు. ఒకరు పేపరుచదివితే మరొకరు వింటారు. టి. వి. కార్యక్రమాలలో ఒక క్రీడలుతప్ప అన్నీ ఇద్దరూ చూస్తారు. భోజనాలదగ్గర వాటినిగురించి చర్చించుకుంటారు.

విశ్వనాథం ఆమె మనసును ప్రతిక్షణమూ తానాక్రమించుకోవాలని చూస్తాడు.

"ఏంలేదు ఊరికే కళ్ళకు నీళ్ళొచ్చాయి."

"ఊరికే ఎందుకువస్తాయి?" ఆయనకు హృదయం కంపించినట్లయింది. ఆమెనుండి సరియైన జవాబురాబట్టాలని "చెప్పు?"అన్నాడు కుర్చీమీదకూర్చోబెట్టూ.

"అబ్బ! చెప్పకపోతే ఊరుకోరు. చెప్తే నాతోపాటు మీకూ బాధ. ఇద్దరం భోజనాలు చేయకుండా కన్నీళ్ళు కార్చాలి."

"అయినాసరే చెప్పితీరాలి."

"చెప్పాల్సిందేనా? మీరు 'ఏంకూరచేశా'వని ఇందాక అడిగారు. ఆ మాట కృష్ణ అడిగినట్టే అనిపించింది. వాడికి వంకాయ మసాలావేసిచేస్తే ఇష్టం. ములక్కాడపులుసు చాలాఇష్టం. వీటిపేరు చెప్పగానే ఎగిరిగంతేసి బల్లదగ్గర కొచ్చేవాడు. ఏంచెయ్యను? ఎంత ఆపుకుందామన్నా ఆగక కన్నీళ్ళొచ్చాయి. మీరు చూడకుండా ఉండాలని వంటఇంట్లోకి వెళ్ళాను."

ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. ఆ గాంభీర్యంలో ఒక్కగా నొక్క కొడుకు-తన కంటిపాప-అతడిమీద ఎనలేని ప్రేమ - చూడాలన్నతపన-కనీసం అతడి కబురైనా వినాలన్న ఆతురత మిళితమై ఉన్నాయి.

కుర్చీకి జారగిల పడ్డాడు.

ఆమె అతడి వెనకగానిలబడి రెండుచేతులూ ఆయన కంఠానికి పెనవేస్తూ "అందుకే చెప్పనన్నాను. మీరిట్లాఉంటే నా మనసు గట్లుతెంచుకుని ఊరిమీదపడే మహానది లాగయిపోతుంది."

ఆమెమాట పూర్తిచెయ్యకముందే టెలిఫోను మోగింది.

"లేచిచూస్తారా? నన్ను చూడమంటారా?"

''నేనే చూస్తాను'' గొంతు సవరించుకుని ఫోను ఎత్తాడు.

"హలో ఎవరు మాట్లాడుతున్నారు?"

"నాన్నా, నేను కృష్ణను. నిద్రపోతుంటే లేపానా?"

''నీమాటే తలుచుకుంటూ భోజనంచేయాలని కూర్చున్నాం బల్లదగ్గర.''

"ఎందుకింత ఆలస్యంచేస్తున్నారు? ఇప్పుడు మీ టైము ప్రకారం పదిగంటలు కావచ్చింది."

"అవున్నా సరిగ్గా అంతే. నీ ప్రయాణం ఎప్పుడు?"

''నేను ప్రస్తుతం బయలుదేరలేను. కాని-మీ రిద్దరూ బయలుదేరి ఎల్లుండి వరకూ బొంబాయి ఎయిర్‌పోర్టులో ఉండాలి. మా స్నేహితుడు ఇద్దరు చిన్న పిల్లలను తీసుకువస్తున్నాడు. వాళ్ళను జాగ్రత్తగా విమానంలోనే మనింటికి తీసుకువెళ్ళండి.''

''అమ్మతో మాట్లాడు''

''వద్దులెండి. అమ్మకు ఒక పెద్దఉత్తరంరాసి పంపిస్తున్నా మా స్నేహితుడి చేతికిచ్చి'' ఫోను పెట్టేశాడు.

"ముందు మనం భోజనంచేద్దాం రా. తరువాత ప్రయాణంసంగతి ఆలోచించ వచ్చు. ప్రయాణంతప్పదు. వాడు చాలాతొందరలో ఉన్నట్టున్నాడు."

ఆమె ముఖం చిన్నబోయింది. 'అంతదూరంనుంచి ఫోనుచేసినవాడు రెండు ముక్కలు మాట్లాడితే ఏంపోయిందో?' అన్న ప్రశ్నార్థకంగాఉంది ఆమె ముఖం.

"అన్నిటికీ ఆలోచించకు. దూరదేశంలో ఉన్నాడు. ఏంచిక్కులొచ్చాయో? ఊఁ ముందు మనం భోజనాలు ముగించుకుని వంటయింట్లోనుంచి బయటపడాలి" తొందర పెట్టాడు.

ఇద్దరూ పనులు ముగించుకొని తలుపులువేసి హాలుదాటి గదిలోకి వచ్చారు. ఎక్కువ మాటలులేకుండా పడకలుచేరి కళ్ళుతెరుచుకునే పడుకున్నారు ఎవరి ఆలోచనలలో వాళ్ళు మునిగి.

ఆలోచనలను మించింది నిద్ర ఎప్పుడు వశపరచుకున్నదో?

తెల్లవారి యథాప్రకారంలేచి కాఫీలూ స్నానాలూ ముగించుకున్నారు. తొమ్మిదిగంటలవేళ విశ్వనాథం బట్టలుమార్చుకుని "నేను అలా బ్యాంకుకు వెళ్ళి డబ్బుతీసుకుని స్టేషన్‌కివెళ్ళి రెండుటికెట్లు తీసుకువస్తాను. నీవు వంటచేసి మనిద్దరికీ బట్టలు చిన్న సూట్‌కేసులోసర్దు. రెండు బ్లాంకెట్లుతీసుకో మనం రైల్లో కప్పుకోవచ్చు. మనం వెయిటింగ్‌రూములోఉండి బొంబాయికివచ్చే విమానం

టైం చూసుకుని టాక్సీలో ఎయిర్‌పోర్టుకుపోదాం. ముందు తలుపేసుకో" బైటికి నడిచాడు.

యాంత్రికంగా తలుపువేసుకుని చాలాసేపు కుర్చీలో కూర్చుండిపోయిం దామె. ఏమిటో ఆలోచనలు ముందుకు సాగటంలేదు. "ఏమిటీ ప్రయాణం? ఆ పిల్లలెవరు? వాళ్ళను స్నేహితుడు తీసుకురావటమేమిటి? వాళ్ళ వయసెంత? వాళ్ళను తీసుకువచ్చి పెంచాలన్న అర్థంకాబోలు."

దిగ్గునలేచి గబగబా వంటచేసింది. అంతలో పనిమనిషివచ్చి "అమ్మగారూ నా పనిఅయింది. ఇంటికెళ్ళమంటారా?" అడిగింది.

"ఇవాళ సాయంత్రం గంట ముందుగా రా. మేము బొంబాయి వెళ్తున్నాం మళ్ళీ రెండు రోజుల్లోవచ్చేస్తాం. రోజూవచ్చి వాకిలిఊడ్చి చెట్లకు నీళ్ళుపొయ్యి. మూడోనాడు పొద్దున తొమ్మిదిగంటలకల్లా వచ్చేస్తాము. నీ విక్కడేఉండు చాలా పని ఉంటుంది. మర్చిపోకు" హెచ్చరికగా చెప్పింది.

పన్నెండుగంటలకు వచ్చాడు విశ్వనాథం. అతడురాగానే ముందుభోజనాలు చేసి సర్దటం మొదలుపెట్టారు. సూట్‌కేసు అతడేసర్దాడు ఆమె వేళకు కాఫీ టిఫిన్ చేసింది.

"రాత్రికి పళ్ళుతెచ్చాను. ఫ్లాస్కునిండా పాలుపొయ్యి ఒక పెట్టిచాలు. మంచినీళ్ళసీసా పళ్ళు ఫ్లాస్కు బుట్టలోపెట్టు."

ఎక్కువ మాటలులేకుండా పనులు పూర్తిచేసుకుని స్టేషన్‌కి వెళ్ళారు.

రైలు కదులుతూఉంటే-కృష్ణ వెళ్ళినప్పుడల్లా బొంబాయి ఎయిర్‌పోర్టు వరకు సాగనంపటం ఇద్దరికీ జ్ఞాపకంవచ్చింది. రైల్లో చదవాలని పెట్టుకున్న వార పత్రికలను పక్కనపెట్టుకుని కిటికీలోనుంచిచూస్తూ ఉండిపోయారు. ఎనిమిది గంటలు కాగానే పళ్ళుతిని పాలుతాగారు.

"ఇంక పడుకుందాం" అనుకుంటూ బ్లాంకెట్లు కప్పుకున్నారు.

ఆమెకు కంటిమీదికి కునుకురాలేదు. "ఆ పిల్లలు ఏంతింటారో - ఏంతాగు తారో? అన్నట్టు ఆ స్నేహితుడే అన్నీ చెబుతాడు. నాకో ఉత్తరంకూడా పంపుతా నన్నాడు. నోటితో చెప్పలేనిమాటలు ఉత్తరంలో రాస్తాడుకాబోలు" ఈ విషయమే చెరొక విధంగా ఊహించుకుంటూ నిద్రలోకి జారుకున్నారు.

మూడవనాడు వేళకు ఎయిర్‌పోర్టుకువెళ్ళి లాంజిలో కూర్చున్నారు. ప్రయాణీకులు ఎవరితొందరలోవాళ్ళు లాంజిలో ఇటూఅటూ తిరుగుతున్నారు. కొంతసేపు ఇద్దరూలేచి షోకేసుల్లో బొమ్మలుచూశారు. బుక్‌స్టాల్లో పుస్తకాలుచూశారు అంతలో విమానం దిగుతోందన్నవార్త వినిపించింది.

ఇద్దరూ ఆత్రంగా ప్రయాణీకులు వచ్చేచోటికి దగ్గరగా నిలబడ్డారు. చక్రాలకుర్చీలో ఇద్దరుపిల్లలను తీసుకుని వస్తున్నాడు కూలి.

"వాళ్లేఅనుకుంటాను" అంటూ ఆయన ఒకడుగు ముందుకువేశాడు.

"మీరేనా విశ్వనాథంగారంటే?" కుర్చీవెనకనుంచి ఒకాయన ముందుకు వచ్చాడు.

"అవును, అవును'' అన్నాడు సంభ్రమంతో.

''వీళ్ళిద్దరినీ మీకు అప్పగించమని మీ కృష్ణ చెప్పాడు. మీకు ఈ ఉత్తరం కూడా ఇవ్వమన్నాడు'' పిల్లలను అప్పగించి సామాను తెస్తానని వెళ్ళి ఒక గంట సేపటికి రెండు పెట్టెలు తీసుకువచ్చాడు.

''వీళ్ళకు ఇచ్చే ఆహారం ఏమిటో ఏవేళకు ఏమి యివ్వాలో దీనిలో రాశాడు, ఈ సంచీకూడా వీళ్ళదే. దీనిలో పాలడబ్బాలు ఫీడింగుబాటిల్సు బిస్కెట్లూ ఉన్నాయి. మార్చటానికి నేప్‌కిన్‌లుకూడా పెట్టాడు. నేను వెళ్ళి నా సామానూ నా టికెట్‌సంగతీ చూసుకోవాలి. ఇంకో రెండుగంటల్లో నాకు ఇంకొక విమానం వస్తుంది. వెళ్ళిపోవాలి, నమస్కారం'' పరుగెత్తినట్టుగా వెళ్ళాడు కృష్ణ స్నేహితుడు.

ఆమె నిర్ఘాంతపోయినట్టు పిల్లలను చూస్తోంది.

ఆయన పిల్లలకుర్చీ తీసుకువచ్చినవాడికి నాలుగు రూపాయలు చేతిలో పెట్టాడు. టాక్సీ మాట్లాడుకుని ఇద్దరు పిల్లలను చెరొకరు ఎత్తుకుని సామాన్లతో టాక్సీ ఎక్కారు.

సామాను డిక్కీలో సర్ది ''ఎక్కడికి సాబ్" అడిగాడు డ్రైవరు.

"ఇండియన్ ఎయిర్‌లైన్సు" అన్నాడు విశ్వనాథం సర్దుకుని కూర్చుంటూ.

''ఇంకా మనకు గంట టైముంది. ఇక్కడ కూర్చుందాం" ఎయిర్‌పోర్టులో

లాంజిలో సోఫామీద కూర్చోబెట్టి సామాన్లుతెచ్చి లగేజివాళ్ళకు అప్పగించాడు. పిల్లలను చెరొకపక్క పడుకోబెట్టుకుని వాళ్ళమీద దృష్టి కేంద్రీకరించి చూస్తోంది ఆమె. "ఈ మగపిల్లవాడూ ఆడపిల్లా రబ్బరుబొమ్మల్లా ఉన్నారు" పోలికలు మాత్రం తెలియటం లేదు" అనుకుంది.

పిల్లలు నిద్రలోనే ఉన్నారు.

విశ్వనాథం వచ్చి "ప్రయాణీకులంతా విమానం ఎక్కుతున్నారు. రా, రా. ఇద్దరం పిల్లలను భుజమ్మీద వేసుకుని పోదాం పద" తొందరపెట్టాడు. ముందు అతడూ వెనక ఆమే విమానంలో ప్రవేశించి సీట్లమీద కూర్చున్నారు.

పిల్లలు ఇంకా నిద్రలోనే ఉన్నారు.

ఆమె అనుకున్నటి, ఇంకా ఎంత సేపు ఇట్లా బిగపట్టుకుని కూర్చోవాలోనని. అంతలో బేగంపేట విమానాశ్రయం వచ్చింది. విమానం నేలమీదికి దిగుతున్న దన్న ప్రకటన వెలువడ్డది. మెల్లగాదిగి సామాను తెచ్చుకుని టాక్సీలో ఇంటికి చేరారు.

పనిమనిషి ఎదురుగావచ్చి సామాన్లందుకుని లోపల పెట్టింది.

హైమవతి దులిపిన పక్కలమీద పిల్లలను పడుకోబెట్టి కాఫీ చేసింది. కాఫీలు తాగిన తరువాత ఇద్దరు కుర్చీలమీద కూర్చుని అప్పుడు ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు.

"ఏమిటీ విషయం? వీళ్ళను పెంచటం ఎట్లా?" కళ్ళతోనే ప్రశ్నించు కున్నారు.

"అమ్మగారూ, స్నానం చేస్తారా? ఈ పాపలు ఎవరి పాపలమ్మా?" అప్ప లమ్మ రాకతో హైమవతి లేచింది. పిల్లల మంచాలకు దగ్గరగా కుర్చీలేసుకుని విశ్వనాథం పేపరు చేతబట్టాడు.

"చూడు అప్పీ, వీళ్ళు అబ్బాయిపిల్లలు. ముందు వీళ్ళను పంపించాడు. నీవు వీళ్ళను కనిపెట్టి చూడాలి. ఇంటిపనికి ఇంకోమనిషిని తీసుకురా. నేను స్నానం చేయడానికి వెళ్తున్నా. ఈలోపల ఇల్లు ఊడ్చి తుడుస్తూఉండు.''

అప్పలమ్మ అంటే పెద్దది కాదు. పదిహేను పదహారేళ్ళ పిల్ల. చలాకీగా

గంతులేస్తూ పనిచేస్తుంది. అక్కడే స్నానంచేసి భోజనం చేస్తుంది. ఇంటిపని శుభ్రంగా కూనిరాగాలు తీస్తూ చేస్తుంది. పెరట్లో పూసే పువ్వు ఒకటి సుతారంగా తలలో పిన్ను పెట్టి పెట్టుకుంటుంది. కళకళలాడే ముఖం. కళ్ళు చిన్నవైనా చురుకైనవి. పిల్లలను చూడగానే దాని మనసు గంతులువేయటం మొదలుపెట్టింది.

హైమవతి గబగబా వంటచేసి విశ్వనాథాన్ని స్నానం చెయ్యమంటోంది. పదకొండు దాటింది, భోజనాల వేళ.

"అయితే అమ్మగారూ, ఇద్దరిని ఎట్లా తీసుకొచ్చారు?'' అప్పి కుతూహలాన్ని పట్టలేకపోతున్నది.

"అయ్యగారూ నేనూ చెరొకర్ని ఎత్తుకుని తీసుకువచ్చాం. ఇంక వీళ్ళ బాధ్యత నీదే. స్నానం చేయించాలి, బట్టలు వెయ్యాలి, ఎత్తుకుని తిప్పాలి. చూస్తావా మరి?"

''నాకు పిల్లలంటే మా చెడ్డ ప్రేమండి. నేనిక్కడే ఉండిపోతాను" అప్పి సంతోషం పట్టలేకుండా ఉంది.

"పిల్లలు లేవలేదుగాని మనం భోజనం చేద్దాంరండి."

ఇద్దరూ భోజనాలుచేసి మళ్ళీ ఆ గదిలోకి చేరుకున్నారు. అప్పి ఎగురుతూ బల్ల శుభ్రంచేసి తనూ భోజనంచేయ నారంభించింది.

''హైమా, కృష్ణ పంపించిన ఉత్తరం చదువుకో. నేనింతలోకి పిల్లలకు పాలు బ్రెడ్ ఎప్పుడివ్వాలో రాసిన కాగితం చదువుతాను."

"పొద్దున లేవగానే పాపకు పాలుపట్టాలి. దానిలో పచ్చిగుడ్డు కలపాలి. బాబుకు ఉడికించిన గుడ్డూ కప్పుపాలు ఇవ్వాలి." ఆయన అప్పిని పిలిచి కోడిగుడ్లు తీసుకురమ్మని పంపించాడు.

ఆమె కృష్ణ ఏంరాశాడో ననుకుంటూ చేతులు ఒణుకుతుండగా ఉత్తరం మడత విప్పింది.

అమ్మా,

ఈ పిల్లలిద్దరూ నీ మనమలమ్మా. నేను మీకు చెప్పకుండా

ఇక్కడ ఒక అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాను. మగపిల్లవాడికి మూడేళ్ళు వెళ్ళు తాయి. పిల్లకు ఎనిమిదోనెల, పేరు సిరి. మగపిల్లవాడు ఆనంద్, వీళ్ళ తల్లి మార్గరెట్ మొన్నటివరకూ ఇక్కడే ఉంది. ఊరికి వెళ్తానని వెళ్ళింది. వీళ్ళను పెంచటానికి ఏర్పాట్లు చెయ్యటం నావల్ల కాలేదు. ఒక రోజు మా స్నేహితుడి ఇంట్లో ఉంచాను. ఆమె ఉద్యోగంచేసే ఆవిడ. ఇక్కడ వీళ్ళను నేను పెంచలేక మీదగ్గరికి పంపుతున్నాను.

"మాకు తెలియకుండా పెళ్ళిచేసుకుని ఇప్పుడు పిల్లలను పెంచమని పంపుతావా ?" అని అంటావా అమ్మా? నీవు అనవని నాకు తెలుసు. నేనుచేసిన తప్పును కూడా మీరిద్దరూ క్షమిస్తారనీ తెలుసు. చిన్నప్పటి నుంచీ నా తప్పులనెన్నిటినో క్షమించి నీవు నన్ను ముద్దుపెట్టుకునే దానివి. నేను ఆ కిట్టూనే అమ్మా. ఈ పిల్లలిద్దరు నాప్రాణసమానులు నాకయినప్పుడు నీకూ అవుతారుకదమ్మా.

ఈ బిడ్డలతల్లి నా తల్లివంటిది కాదమ్మా. ఆమెకు నీవంటి హృదయంలేదని ఇటీవలే తెలుసుకున్నాను. నా జీవితం నీవు ప్రసాదించిన నీ కిట్టూ జీవితం అనుకోని మలుపు తిరిగింది. దాన్ని చక్కదిద్దేదీ, దిద్దగలిగినదీ నీవేనమ్మా. గిలగిల కొట్టుకునే నా మనసును శాంతింపచేయగలదానవు నీవేనమ్మా.

అమ్మా, మరొక్కమాట, తల్లి ఒదిలిపెట్టినట్టుగా నేనుకూడా వదిలిపెడితే వీళ్ళిద్దరూ అనాథశరణాలయంలో చేర్చబడతారు నీ కిట్టూ బ్రతికిఉండగా వాళ్లను అనాథలుగా చేయగలడా ? దిక్కులేని వాళ్ళని ఎట్లా అనిపించగలడు ? మాతృప్రేమతో పొంగిపొరలే నీ రక్తమే నాలోనూ ప్రసారమవుతున్నది. ఏ దేశంలో ఉన్నా ఎంతదూరాన ఉన్నా అది మారదు. అందుకనే ఇంతబాధ, నా బాధను పంచుకుంటావన్న ధైర్యంతో పిల్లలను నీదగ్గరికి పంపుతున్నాను. నేను తిరిగి చిన్నపిల్లల రూపంలో నీదగ్గరికి వచ్చాననుకుని వాళ్ళను ఆదరించి పెద్దవాళ్ళను చేస్తావు కదూ ?

నేను ఇదివరకు చేసిన తప్పు ఇంక చెయ్యను. నీకు నాలుగురోజులకొకసారి ఫోను చేస్తాను. ఉత్తరాలు రాస్తాను.

నీ చిన్న కిట్టూ

ఆ ఉత్తరం చేతిలోనుంచి జారి కిందపడిపోయిందని ఆమెకు తెలియదు.

గోడకానుకుని కళ్ళుమూసుకుంది. కన్నీళ్ళతో ముఖమంతా మలినమయిపోయింది. దేహం పక్కకు ఒరిగిపోయింది.

విశ్వనాథానికి చటుక్కున ఏదో జ్ఞాపకం వచ్చింది. పేపరక్కడ పడేసి దిగ్గున లేచాడు. వంటయింట్లోకీ గదిలోకీ వెళ్ళి చూచాడు. పెరట్లోకి తొంగిచూశాడు. "ఏదీ హైమ ? ఎటువెళ్ళింది ?"

"ఏటి అయ్యగారూ ? అమ్మగారులోన ఉన్నారు".

"ఎక్కడ ? చూడు" ఆదుర్దాపడిపోతున్నాడు.

అప్పి చేతులు కడుక్కుని లేచింది. నాలుగు అంగల్లో గదులన్నీ చూసి "అమ్మగారు ఇక్కడే ఉన్నారు. గోడకు ఒరిగిపొయ్యారు. అయ్యో, మీకెదురుగానే ఉన్నారు, చూడలేదా అయ్యగారూ?" అంటూ ఆమెను కుదిపి కుదిపి లేపింది.

కళ్ళు నులుపుకుంటూ నిద్రలోనుంచి లేచినట్టుగా విశ్వనాథం కనబడగానే దిగ్గునలేచి "ఏమయింది?" అన్నట్టు చూసింది.

"ఏంకాలేదు, నీవు మంచమ్మీద పడుకోలేదా?"

ఆమె చుట్టూచూసి కిందబడ్డ ఉత్తరాన్ని అందుకుని "పడుకుందామనే అనుకుని ఉత్తరం చదువుతున్నాను. అంతలో కళ్ళు మూతలుపడ్డాయి" అంది.

"బాగా మెలకువ వచ్చిందా? ఇటొచ్చి కుర్చీలో కూర్చో, ఇప్పుడే వస్తాను" అనుకుంటూ క్షణంలో హార్లిక్సు కలిపి తెచ్చాడు.

"తాగుతూ ఉండు, నేనూ చదువుతాను ఆ ఉత్తరం. ఏదీ ఇటివ్వు'' ఆమె చేతుల్లోనుంచి అందుకున్నాడు. ఆయన కళ్ళు గబగబా పంక్తి తరువాత పంక్తి వెంట పరుగులు తీశాయి.

మడిచి జేబులో పెట్టుకుంటూ ఆమె ముఖంలోకి చూశాడు.

ముఖం పీక్కుపోయినట్టుగాఉంది.

"పిల్లలు ఇంకాలేవలేదు. లేపాల్సిందే. పాపకు పాలుకలిపి బుడ్డితో తాగించు" పాలబుడ్డి ఆమె చేతికందించాడు.

ఆమెబిడ్డనుచూసి "అయ్యో ఎప్పుడు పాలుతాగిందో? కడుపు ఉసూరు

మంటోంది. లేపటమెందుకు ? పాలబుడ్డీ పీక నోట్లో పెట్టేస్తాను" పాపను ఒక పక్కకుతిప్పి బుడ్డీ నోట్లో పెట్టింది. పాప గబగబాతాగేసి మళ్ళీ కళ్ళుమూసుకుంది. పెదవులు తుడిచి దుప్పటికప్పి మంచమ్మీదినుంచి లేచింది ఆమె.

"అబ్బాయిని లేపద్దు లేచినప్పుడే పాలు గుడ్డూ ఇస్తేసరి" అని కృష్ణ ఉత్తరంమాట ఎత్తకుండా "హైమా మన కృష్ణగది శుభ్రంచేయించు. రెండు బేబీకాట్లు పంపమని కంపెనీకి ఫోనుచేస్తాను. వాటికి ఇటూఅటూ రైలింగ్సు ఉంటాయి పిల్లలు పడకుండా. అలాగే పరుపులూ దిండ్లూకూడా పంపమంటాను" అన్నాడు.

కృష్ణ బల్లాకుర్చీ పుస్తకాల బీరువా అట్లాగేఉంచి గది కడిగి తుడిపించారు. కిటికీలకు కొత్త పరదాలు వేయించారు. సీలింగు ఫాను తుడిపించారు.

కృష్ణగదిలో రెండు బేబీకాట్లు వాటిమీద డన్‌లప్ పరుపులూ సాయంత్రం ఐదుగంటలయేసరికి సిద్ధమయ్యాయి దోమతెరలతోసహా.

కృష్ణగదిలో అతడిబిడ్డలు-బ్రతికిఉండీ దగ్గరలేని తల్లిదండ్రులు ! ఆమెకు దుఃఖం ఉబకి ఉబకి పైకిపొంగుతోంది. కన్నీళ్ళు రూకటానికి సిద్ధపడ్డాయి. విశ్వనాథం వచ్చి చూస్తాడేమోనని కళ్ళుతుడుచుకుని "అంతా సిద్ధమయింది" అన్నది.

"అవునుగానీ అతడు ఒక్కడూ పిల్లలనిద్దరినీ ఎట్లా తీసుకువచ్చాడు ?" కుతూహలంతో అడిగింది.

"ఎయిర్ హోస్టెస్‌లు చూస్తారు. అందుకు డబ్బుకట్టాలి."

విశ్వనాథం మంచాలకు దోమతెరలు కడుతుండగా ఆనంద్‌లేచి డాడీ అంటూ రాగంతీశాడు.

విశ్వనాథం పాలు తాగించబోయాడు. బిస్కెట్ చూపించాడు.

డాడీ డాడీ అంటూ పిల్లవాడు విశ్వనాథాన్ని తోసేశాడు.

అంతలో విశ్వనాథం గ్రహించుకుని "డాడీ ఈజ్ కమింగ్. యూ టేక్ దిస్" అంటూ ఉడకబెట్టిన గుడ్డు చూపించాడు. పాలు బిస్కెట్ మళ్ళీ యివ్వబోయాడు.

ఆనంద్‌కి అంతా కొత్తగాఉంది. తండ్రి కనబడలేదు. దాంతో కోపం వచ్చింది.

హైమా అంటూ ఆమెవైపుచూశాడు విశ్వనాథం.

ఆమెలేచి "హలో ఆనంద్, యూవాంట్ డాడీ ? హి విల్ కమ్. ఆనంద్ మైడియర్ డూ యూ హావ్ ఎవర్ సీన్ కిటెన్ ? సీ హౌ స్వీట్ దే ఆర్ !" అంటూ పెరట్లోకి తీసుకువెళ్ళి పిల్లినీ పిల్లికూనలనూ చూపించింది.

కళ్ళు పెద్దవిచేసి ఆశ్చర్యంతో వాటినిచూస్తూ-

"స్వీట్ స్వీట్ వెరీనైస్" అంటూ చప్పట్లుకొడుతూ వాటినేచూడటం మొదలుపెట్టాడు. అంతలో హైమ గుడ్డును తునకలుచేసి నోట్లోపెడుతూ వచ్చింది. ఆనంద్ చప్పట్లుకొడుతూ పిల్లికూనలు పరుగులు తీస్తుంటే చూస్తూ తినటం మొదలు పెట్టాడు. పాలుతాగాడు. అవి మ్యావ్ మ్యావ్‌మని అంటుంటే ఆనంద్‌కూడా అలా అనాలని ప్రయత్నాలుచేశాడు. వాటివెంట పరుగుతీశాడు.

అప్పటినుంచీ తోటలో పూలుచూపించి, అప్పినిగంతులు వెయ్యమనీ పాటలు పాడమనీ ఆహారం ఇస్తూఉండేది హైమవతి.

సిరి ఒక సమస్యగాలేదు.

వాళ్ళు వచ్చిన తరువాత మూడురోజులపాటు అదేపనిగా నిద్రపోతుంటే విశ్వనాథం డాక్టర్ని పిలుచుకువచ్చాడు. నిద్రపోతున్న పిల్లలను పరీక్షచేసిన డాక్టరు "ఇద్దరూ బాగానేఉన్నారు. ఈ పిల్లలెవరు ? ఎక్కడినుంచివచ్చారు ?" అడిగాడు.

"వీళ్ళు మా మనమలండీ. విదేశాలనుంచి మా అబ్బాయి పంపించాడు. వీళ్ల వచ్చినప్పటినుంచీ ఒకటే నిద్రపోతున్నారు. మాకు భయంవేసింది."

డాక్టరు పకాలున నవ్వాడు. "విమానంమీద అన్నిగంటలు ప్రయాణం చేసిన తరువాత అందరికీ ఇలాగేఉంటుంది. జెట్‌లాగ్ అంటారే అదన్నమాట. చిన్నలకూ పెద్దలకూకూడా ఉంటుంది. అదీకాక వాళ్ళు అక్కడ రాత్రి నిద్ర పోతారుకదా ? మర్నాడు పగలుకనుక మేలుకుంటారు. వాళ్ళకు పగలయితే మనకు రాత్రన్నమాట. మళ్ళీ నిద్రపోవాలని మన మనుకుంటాం కాని నిద్రపోరు.

ఏడుస్తారు. ఎందుకంటే రాత్రీపగలూ తేడాలవల్ల, అందుకని వాళ్ళు నిద్రపోతే పోనివ్వండి. మేలుకుంటామంటే మేలుకోనివ్వండి. ఇంతకూ రిటైరయ్యాక చిన్న పిల్లలను మళ్ళీ పెంచుతున్నారన్నమాట మంచిది. అవసరము వచ్చినప్పుడు పిలవండి." అంటూ వెళ్ళిపోయాడు.

నాలుగురోజులు గడిచిన తరువాత ఏం జ్ఞాపకం వచ్చిందో ఆనంద్ మళ్ళీ డాడీ డాడీ అంటూ ఏడుపు మొదలుపెట్టాడు. విశ్వనాథం ఎంత మరిపించినా ఏడుపాగలేదు. అప్పుడు గదిలోకి వెళ్ళి కృష్ణఫోటో తెచ్చి చూపించాడు. దాన్ని పట్టుకుని ఇల్లంతా తిరిగి పిల్లికూనలు కనబడగానే వాటివెంట పరుగెత్తాడు ఆనంద్.

ఈలోపల అప్పి అని పిలవటం నేర్చుకున్నాడు. అప్పి చిన్నచిన్నమాటలు తెలుగులో నేర్పించింది. ఎత్తుకుని బజారుకెళ్ళటం తోటలో తిప్పటం బొమ్మలతో ఆడించటం మొదలుపెట్టింది.

సాయంత్రంకాగానే సిరినెత్తుకుని ఆనంద్ చెయ్యిపట్టుకుని పెరడంతా తిప్పేది. వాళ్ళను నవ్వించేది. పిల్లికూనలను చూపిస్తూ పరుగులు తీయించేది. సిరి పట్టుకుని నిలబడటం నేర్చుకుంది. అప్పిదగ్గర బాగా అలవాటయ్యారు పిల్లలు. అప్పికూడా తనవేషం మార్చుకుని వాళ్ళకు మాటలు నేర్పుతూ తానుకూడా ఇంగ్లీషుమాటలు నేర్చుకుంది.

కృష్ణ తల్లికి ఉత్తరంలో రాసినట్టుగా అప్పుడప్పుడు ఫోనుచేస్తున్నాడు. అతడికి భయంగాఉంది. పిల్లలు ఎట్లా పెరుగుతున్నారోనని. తల్లిదండ్రులను కష్టపెడుతున్నానన్న బాధా కలుగుతోంది.

పన్నెండూ ఒంటిగంట అవుతోంది. పిల్లలు ఎంతసేపటికీ నిద్రపోలేదు ఆరోజు. విశ్వనాథానికి నిద్రముంచుకువస్తోంది. హైమకు ఆవలింతలు వస్తున్నాయి.

పిల్లలు నిద్రపోవటంలేదు.

"అమ్మగారూ- మీరు పడుకోండి. అయ్యగారికికూడా చెప్పండి. నేను ఆడిస్తూఉంటాను" అప్పి ధైర్యం చెప్పి పిల్లలను ఇద్దరినీ చాపమీద పడుకోబెట్టి తాను ఎగురుతూ పాటలు పాడటం మొదలుపెట్టింది.

పిల్లలకు నిద్రరావటంలేదు. అప్పి ఎగురుతుంటే నవ్వుతూ చూస్తున్నారు. చప్పట్లు కొడుతున్నారు. అప్పి పాట ఆపగానే ఏడవటం మొదలుపెట్టారు.

ఆడి పాడి ఎగిరి అప్పి అలిసిపోయింది.

తెల్లవారవచ్చింది. పిల్లలు మళ్ళీ ఏడుపు ప్రారంభించారు. ఇద్దరు పిల్లలను అప్పి పట్టుకోలేకపోతోంది.

విశ్వనాథం లేచాడు. ఆయన దగ్గరికి పిల్లలు వెళ్ళలేదు. హైమ వచ్చి సిరిని ఎత్తుకోటానికి ప్రయత్నించింది. ఇద్దరూ ఒకరినిచూసి ఒకరు ఏడుపు అధికం చేశారు.

విశ్వనాథం హేమ తలలుపట్టుకుని కూర్చున్నారు ఏటూతోచక.

"ఏంటి అమ్మగారూ. కొంచెము తెల్లవారనీయండి. నేను నాలుగువీధులూ తిప్పుకొస్తాను. అయ్యగారూ, మీరు పాపనెత్తుకోండి." అప్పిలేచింది.

విశ్వనాథానికి పిచ్చెక్కినట్టుగాఉంది. ఈ పిల్లలిద్దరూ ముగ్గురు పెద్దవాళ్ళను తిప్పలు పెడుతున్నారు. వీళ్ళ అలవాట్లు అగమ్యగోచరంగా ఉన్నాయి. ఎందు కయినా మంచిదని డాక్టర్ని రమ్మని ఫోనుచేశాడు.

వచ్చిన డాక్టరు పిల్లలనుచూసి "బాగానే ఉన్నారండి. వాళ్ళకి ఇంకా కొత్త పోలేదు. వాళ్ళ అలవాట్లు ఏమిటోమరి. కొన్నిరోజులయితేగాని సర్దుకోలేరు. మీ కృష్ణ పెద్దవాడయిన తరువాత మీరు పిల్లలసంగతి మర్చిపోయినట్టున్నారు. మెల్లగా ఒక్కొక్కటే జ్ఞాపకం చేసుకోండి" అంటూ వాళ్ళిద్దరూ నవ్వుతూ ఉండగా వెళ్ళాడు.

ఆ మరునాడు పిల్లలిద్దరూ వాంతిచేసుకున్నారు. జ్వరం నూరుడిగ్రీలు దాటింది. పెద్దవాళ్ళగుండెలు దడదడమన్నాయి.

"ఈ వాతావరణం పిల్లలకు కొత్తచేసింది రెండు విరేచనాలయినా భయ పడకండి. నేను మందు పంపుతాను ఇవ్వండి'' అన్నాడు డాక్టరు.

పదిరోజులు కష్టంగా గడిచాయి. పిల్లలులేచి తిరగటం మొదలుపెట్టారు. అప్పి హైమనూ విశ్వనాథాన్నీ బామ్మా తాతా అని పిలిపించటానికి తంటాలు

పడుతోంది. పిల్లల భోజనాలూ పడకలూ పాలు తాగటాలూ క్రమబద్ధమవు తున్నాయి. విశ్వనాథం వాకిట్లో గేటుదగ్గర అరుగుమీద కూర్చుని వాళ్ళు ఆడు కుంటుంటే చూస్తూఉన్నాడు. ఆయన కాళ్ళనొప్పులు మరిచిపోయాడు. హైమ పిల్లలనుచూస్తూ తనకొడుకునుగురించి దిగులు పడటం కొంతతగ్గింది.

"వీళ్ళను వదిలిపెట్టి ఎట్లా వెళ్ళిందండీ ఆ తల్లి ?" హైమ పిల్లలనుచూస్తూ అడుగుతుంది విశ్వనాథాన్ని రోజుకొకసారైనా.

"పిల్లనైనా తీసుకువెళ్ళమంటే నీపిల్ల నాకక్కరలేదని తల్లి వెళ్ళిపోయిందట. కృష్ణ ఉత్తరంలో రాశాడు- చదవలేదూ ?" అన్నాడు విశ్వనాథం.

"అదేమిటండీ కన్నతల్లికదా ? ఎట్లా అనగలిగిందామాట ?"

"అందరూ కనగలరు. కొందరు మాత్రమే ఆమాట అనగలరు."

"ఇన్నాళ్ళ జీవితంలో మనమెప్పుడైనా విడివిడిగా రెండురోజులయినా ఉన్నామా ? నేనెప్పుడైనా కోపమొచ్చి మావాళ్ళయింటికి వెళ్ళినా మరునాడే బెంగ పెట్టుకుని తిరుగుముఖం పట్టేదాన్ని. అప్పటికే మీరు ఇల్లు బయలుదేరి దారిలో కలుసుకుని వెంటబెట్టుకునివచ్చేవారు."

"నీవుమాత్రం కృష్ణను వదలిపెట్టి ఉండేదానవా ?" వాడిని చూడాలంటూ కలవరించేదానవుకాదూ ?"

"బిడ్డను కన్నతల్లిని కదండీ. తల్లిబిడ్డను చూడకుండా ఉండగలదా? మాతృహృదయమంటే ఏమనుకున్నారు ?"

విశ్వనాథం ఆలోచిస్తున్నాడు - 'తల్లిమనసు అందరికీ ఒకమాదిరిగా ఉండదా ?' అని.

మొదట భయపడినట్టుగా కాకుండా పిల్లలిద్దరూ అప్పీ అప్పీ అంటూ ఆమెను వదలిపెట్టటంలేదు. అప్పి ఇంటికిపోవటంమరిచిపోయినట్టేఉంది. పిల్లలను చూడగానే చిన్నపిల్లగా మారిపోయింది. చిలిపిచేష్టలూ ముద్దుమాటలూ ఆటలూ పాటలూ- అదొక ప్రపంచమయింది. అన్నిటికంటె ఆనంద్‌కి తెలుగుమాట్లాడటం బాగావచ్చింది. సిరికి ఏడాది వెళ్ళగానే చిన్నచిన్నమాటలు వస్తున్నాయి.

హైమకూ విశ్వనాథానికి పేపరు చదవటం, టి.వీ. చూడటం- ఆ అలవాటే తగ్గిపోయింది. పిల్లలను గురించిన మాటలతోనే రోజులు గడిచిపోతున్నాయి.

"మీకు కోపంవస్తే చల్లగాలికి అలా బైటతిరిగి నవ్వుతూ ఇంటికి వచ్చేవారు కదూ ? మీకోపం తాటాకుల మంటలాంటిది. చల్లగాలికి కోపతాపాలు తగ్గి కరకర ఆకలివేసేది. అన్నంపెట్టు అనేవారు" హైమ చిరునవ్వుతో సిగ్గులొలకపోస్తుంటే సగం నెరిసిన తలవెంట్రుకలు ముఖంమీదికి జారేవి.

"నీవు మాత్రం ? మూతిముడుచుకుని నన్ను తప్పించుకుని తిరిగేదానవు కాదూ ? ఏ స్నేహితురాలో రాగానే కబుర్లు చెప్పుకుంటూ అన్నీ మరిచిపోయేదానవు. నాకు తెలియదనుకోకు" మధ్య మధ్య జీవితాలను సింహావలోకనం చేసుకునేవారు.

పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యారు. తెలుగు భోజనం- తెలుగు చిరుతిండ్లూ అచ్చం తెలుగు పిల్లలనిపించుకుంటున్నారు నానాటికి. జంతికలంటే మహాయిష్టం ఇద్దరికీ. గారెలంటే కొరుకుతూ తినటం నేర్చుకున్నారు. అప్పి భోజనంచేసేటప్పుడు తాతగారి దగ్గరకొచ్చి పాటలుపాడేవారు. ఆయనకది పరమానందంగా ఉండేది.

ఆ ఊళ్లో ఒక ప్రొఫెసరు రిటైరయిన తరువాత నర్సరీ స్కూలొకటి స్థాపించింది. ఆమెకు బిడ్డలులేరు. కేవలం తన తృప్తికోసం విదేశాలలోని పాఠశాలలన్నీ పర్యవేక్షించి దానిని నెలకొల్పింది. ఆమెకూ భర్తకుకూడా దానిలో అభిరుచి కలిగింది. వాళ్ళిద్దరు కొందరు టీచర్లకు శిక్షణఇచ్చి స్కూలు ప్రారంభించారు.

ఆ స్కూలు నచ్చటంచేత విశ్వనాథం పిల్లలను దానిలో చేర్పించాడు. అప్పికి పిల్లలను స్కూలుకు తీసుకువెళ్ళటం- మళ్ళీ యింటికి తీసుకురావటం మహాసరదాగా ఉంది.

కృష్ణవస్తానని రాసినట్టుగారాలేదు. అలా మూడుసంవత్సరాలు గడిచిన తరువాత వచ్చి ఒక స్నేహితుడింట్లోదిగాడు. ఇన్నాళ్ళూ పిల్లలనుగురించి ఆ స్నేహితుడితో ఉత్తరప్రత్యుత్తరాలు నడుపుతున్నాడు. ఆ స్నేహితుడు స్కూలుకు వెళ్ళి ఫొటోలుతీసి కృష్ణకు పంపుతున్నాడు. పిల్లలు బాగా అలవాటు పడ్డారాలేదా అని కృష్ణ తెలుసుకుంటున్నాడు అతడిద్వారా. అందుకే ఆ స్నేహితుడు విశ్వనాథం

ఇంటికి తరుచుగా వెళ్ళుతూఉండేవాడు. పిల్లలు అతడిని చనువుగా అంకుల్ అని పిలిచేవారు.

కృష్ణ స్నేహితుడు కృష్ణను స్కూలుకు తీసుకువెళ్ళి ప్రిన్సిపల్‌కి పరిచయం చేశాడు. స్కూల్లో చదువుతున్న పిల్లలను చూపించాడు.

కృష్ణ మనసులో సంతృప్తి కలిగింది. స్నేహితుడిద్వారా తల్లిదండ్రులు పిల్లలకుచేసిన ఏర్పాట్లువిన్నాడు.

అప్పడే ఊరినుంచి వచ్చినట్టుగా పిల్లలు ఇంట్లోఉండగా సూట్‌కేసుతో కృష్ణ ఇంట్లో అడుగుపెట్టాడు.

అప్పుడు ఉదయం ఏడుగంటలు.

పిల్లలు స్నానాలుచేసి తలలు దువ్వుకుని బట్టలువేసుకుని భోజనాలింట్లో బల్లకు ఒకవైపు కుర్చీలమీద కూర్చున్నారు. వాళ్ళకెదురుగా తాతా బామ్మా కూర్చున్నారు. అప్పి మంచినీళ్లూ ప్లేట్లూ పెట్టింది. స్కూలు కబుర్లుచెప్పి నవ్విస్తూ పిల్లలు ఇడ్లీ తింటున్నారు. పరమానందంతో పెద్దలు వాళ్ళనుచూస్తూ కాఫీ తాగుతున్నారు. పిల్లలు హార్లిక్సుతాగి "మీకంటె మేమే ముందుతాగాం" అని చప్పట్లు కొడుతున్నారు.

అప్పుడు కృష్ణ భోజనాలింట్లోకి తొంగిచూశాడు.

విశ్వనాథం, హైమలు ఆతడినిచూసి దిగ్భ్రాంతులయ్యారు.

"ఎప్పుడొచ్చావురా ? నీకిప్పుడు రైలు ఏదీ ?" అంటూ అతడిని చెరొకపక్క పట్టుకుని ఊపుతూ "ప్లేన్‌లో బొంబాయివరకూ వచ్చావా ? లేక ఇక్కడికే ప్లేన్‌లో వచ్చావా ? అయినా ఇంకా వేళకాలేదే ?" వాళ్ళకు వాళ్ళ అబ్బాయిని గురించే ఆలోచన- సంభ్రమమూ, కృష్ణకూ తన పిల్లలనుగురించి ఆలోచన. పరస్పరం ఊపిరాడని ప్రశ్నలు వేసుకుంటున్నారు వాళ్ళు.

"పిల్లలను పంపించి వెంటనే వస్తానన్నవాడివి ఇప్పుడా రావటం ?" కృష్ణను కదలనీయకుండా ప్రశ్నిస్తున్నారు.

పిల్లలతడిని తెల్లబోయిచూస్తూ "ఈ అంకుల్ ఎవరు తాతా" అడుగుతున్నారు.

"చూడరా నీ పిల్లలను ? వాళ్ళు ఎట్లా పెరుగుతున్నారో చూడు. వాళ్ళను పలకరించు. అంతా తెలుగుభాష. అట్లా వెర్రిచూపులు చూస్తావేం ? మాట్లాడు'' అంటోంది హైమ.

పిల్లలకు కొత్తలేదు. కృష్ణపిలిస్తే దగ్గరికి వెళ్ళారు. అతడు తెచ్చిన బొమ్మలూ బట్టలూ తీసుకుని ఎగురుతూ గదిలోకి వెళ్ళారు. అప్పికి చూపించారు. ఇల్లంతా గంతులువేశారు. బొమ్మలు పరుగెత్తుతూఉంటే బలేబలే అంటూ చప్పట్లు కొడుతూ ఇల్లంతా తిరుగుతున్నారు.

కృష్ణకు ఇదంతా ఆశ్చర్యంగాఉంది. ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

ఆరోజంతా పిల్లలు అతడిని వదలిపెట్టలేదు.

తెల్లవారి స్కూలు. అప్పి పిల్లలను లేపి స్నానాలు చేయించి బట్టలు వేసింది ఇద్దరూ టిఫిన్ తిని పాలుతాగారు. స్కూలుకు వెళ్ళటానికి కాళ్ళకు షూజులేసుకుని పుస్తకాల సంచులు తీసుకుని అప్పితో బయలుదేరారు.

''అంకుల్ అన్నిబొమ్మలు తెచ్చాడు. అంకుల్‌కి టాటా చెప్పండి" అన్నది అప్పి.

ఇద్దరూ టాటా అంకుల్ అంటూ వెళ్లారు.

''ఈ బేబీ సిట్టర్‌ని ఎక్కడినుంచి తీసుకువచ్చారు ?" ఆశ్చర్యపడుతూ అడిగాడు కృష్ణ.

''అది ఇంట్లో పనిచేసే అప్పలమ్మ. పిల్లలురాగానే వేషం భాష మార్చుకుని బేబీ సిట్టరయింది."

అప్పుడు కృష్ణ గారాబాల చిన్నకృష్ణుడై కిట్టుగా మారి- "అమ్మా నాన్నా. నేనువచ్చి వారంరోజులయింది. శ్రీహరి ఇంట్లోదిగాను. పిల్లల స్కూలుచూశాను. అక్కడ శిక్షణచూశాను. చాలా ఆనందంగా ఉంది, ఇంట్లోకూడా వాతావరణం బాగా మారిపోయింది." తల్లిపక్కన కూర్చున్నాడు.

"నాన్నా నన్ను ఇట్లాపెంచారా ? అమ్మా చెప్పు ?"

"అవునురా వాళ్ళు నా మనమలు. విదేశాలలో పుట్టి, మమ్మల్ని వెతు

క్కుంటూ వచ్చిన పిల్లలు. వాళ్లే నీకంటె మాకెక్కువ. ఏమనుకుంటున్నావో?'' అంటూ జంటగా భుజాలమీద చేతులు వేసుకుంటూ హాల్లోకి వచ్చారు. వాళ్ళతో హైమకూడా వచ్చింది.

"అమ్మా, నాకు నిన్నటి జంతికలు పెట్టవూ ?" అంటూ తల్లిముందర చెయ్యిచాపాడు.

ఆమె కిట్టూ బాల్యచేష్టలను జ్ఞాపకానికి తెచ్చుకుని ఆనందబాష్పాలతో అతడిచేతిలో జంతికల ప్లేటు పెట్టింది.

"కిట్టూ, వీళ్ళను తీసుకువెళ్దామని వచ్చావా ?" ఇద్దరు ముఖాలు అదొక మాదిరిగా పెట్టుకుని అడిగారు.

"అమ్మా, వీళ్ళను నేనిట్లా పెంచగలనా ? ఇంత ఆప్యాయతా వాత్సల్యమూ నేను చూపగలనా ? మావి యాంత్రికమయిన జీవితాలు. పిల్లలపట్ల ఇంత శ్రద్ధ ప్రేమచూపించటానికి మాకు టైమెక్కడిది? ఏవో పైపై తియ్యటిమాటలేగాని వాటిలో నిజమైన స్వచ్ఛమైన తీపిఉందా ?'' అన్నాడు ముఖం అదోలా పెట్టుకుని.

కిట్టూ పిల్లలు ఇంట్లోలేనప్పుడు అల్లరికృష్ణుడిగానూ పిల్లలున్నప్పుడు వాళ్ళను చూడటానికి వచ్చిన అంకుల్‌గానూ మెలిగాడు ఆ యింట్లో.

వెళ్ళేటప్పుడు తల్లినీ తండ్రినీ విడిచి వెళ్ళలేక కౌగలించుకున్నాడు. పిల్లలను ఎత్తుకుని ముద్దులు కురిపించాడు. "మళ్ళీవస్తాను. ఈసారి ఇంకా మంచి బొమ్మలు తెస్తాను. రోబర్టును మీకుతెచ్చి చూపిస్తాను" వాళ్ళచేత ముద్దులు పెట్టించుకుని మరీవెళ్ళాడు.

అక్కడికి వెళ్ళగానే ఒక ఉత్తరం రాశాడు.

అమ్మా ! నాన్నా !

మీదగ్గర పిల్లలు ఎంతో ప్రేమతో అపురూపంగా పెరుగుతున్నారు. మీ మనసులలో మీ పిల్లలకేకాకుండా మా పిల్లలకుకూడా పంచి యివ్వగల మమతానురాగాల పాతర ఉన్నది. మా దగ్గర అంత సంపదలేదు. ఇక్కడ మేము వాళ్ళకు కావలసినవి కొని ఇవ్వగలం కాని- అంతటి మమతనూ శ్రద్ధనూ చూపలేము. వాళ్ళు మీదగ్గర ఉంటేనే మంచిపిల్లలుగా రూపుదిద్దుకుంటారు.

అంతా వాళ్ళకేనా అమ్మా ! నాకుకూడా మమతానురాగాలను దాచిఉంచవూ? వాళ్ళను చూసుకుంటూ నీ చిన్నకిట్టూను మరచిపోకు.

మళ్ళీరాస్తాను.

ఇట్లు

మీ చిన్నకిట్టూ.

"చూడండి ఎలారాశాడో ! వీడు మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడా ? లేక అలాగే ఉండిపోతాడా ?"

"ఏమో ? ఒకపెళ్ళిచేసుకుని ఇద్దరు పిల్లల్ని ఇక్కడికి పంపించాడా ? ఇక ముందేంచేస్తాడో ? ఇదివరకు కిట్టూ కిట్టూ అంటూ కన్నీళ్ళు కార్చేదానివి. ఇప్పుడు నీవంతగా వాడికోసం కలవరించటంలేదు. అవునా-కాదా ? ప్రస్తుతానికి మనసు ప్రశాంతంగా ఆనందంగా ఉందికదా ? వాడిమాటలు వీళ్ళు పెద్దవాళ్ళయ్యే వరకూ ఇట్లాగే ఉంటాయనుకో. ఆఁ పిల్లలు స్కూలునుంచి వస్తారు. ఏంకావాలో వాళ్ళకుచూడు" అంటూలేచాడు కుర్చీలోనుంచి విశ్వనాథం.